

మహిళల భద్రతకు భరోసా



- 'టీ-ఎస్' యాప్‌ను ప్రారంభించిన పోలీసుశాఖ
- మహిళలు, యువతుల రక్షణకు తోడ్పాటు
- విస్తృత ప్రచారం అవసరం..

వాంకిడి, ఏప్రిల్ 15: మహిళల భద్రతకు తెలంగాణ పోలీసుశాఖ మరో యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏదైనా ప్రమాదంలో ఉన్న యువతులు, మహిళలు వెంటనే యాప్‌ను ఉపయోగించి సురక్షితంగా ఇంటికి చేరుకునే భరోసాను పోలీసులు కల్పిస్తున్నారు. ఇప్పటికే అతివల భద్రతకోసం అనేక మొబైల్ యాప్‌లను ప్రవేశపెట్టిన పోలీసు శాఖ తాజాగా టీ-సేఫ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతనెల 12న దీనిని ప్రారంభించారు. ఈ ఆప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చాలా మందికి ఈ యాప్‌పై అవగాహన లేదు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో దీనిపై విస్తృత ప్రచారం చేపట్టడం ద్వారా మహిళలకు పూర్తి స్థాయిలో భరోసా లభించే అవకాశం ఉంది.

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడైనా వినియోగించుకునే ఈ యాప్‌పై విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. నేటికాలంలో యువతులు, విద్యార్థినులు, మహిళలు ఎక్కడికి వెళ్లినా ఏదో రకమైన ప్రమాదం పొంచి ఉంటుంది. ఒంటరిగా ప్రయాణం సమయంలో విద్యాసంస్థలకు వెళ్లే ప్రాంతాల్లో వేధింపులు, అఘాయిత్యాలు జరిగే అవకాశం ఉంటుంది. వీరికోసం పోలీసు శాఖ ఎంతో పకడ్బందీగా రూపొందించిన టీ-సేఫ్ యాప్ రక్షణగా నిలవనుంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఒంటరిగా వెళ్లే సమయంలో తమ వివరాలు యాప్‌లో నమోదు చేసి ప్రయాణం చేస్తే చాలు పూర్తి సమాచారం పోలీసుశాఖ ఆధీనంలోకి వెళుతుంది. నిర్దేశిత సమయం తరువాత స్పందన లేనిపక్షంలో వెంటనే పోలీసులు అప్రమత్తమై మొబైల్ నంబర్ ఆధారంగా ట్రాకింగ్ చేసి వారు ఉన్న ప్రాంతాన్ని తెలుసుకుని రక్షించే వీలుంటుంది.

డౌన్‌లోడ్ ఇలా...

పోలీసుశాఖ రూపొందించిన టీ-సేఫ్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఫోన్‌నెంబర్‌తో లాగిన్ కావాలి. పేరు, వివరాలు తెలపాలి. మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేయాలి. వెంటనే వెరిఫై(పరిశీలిన) చేసుకుంటుంది. 110, 112 నంబరుకు ఫోన్ చేసి ఐవీఆర్ ఆప్షన్ ద్వారా మొబైల్ ఫోన్‌లో ఉండే ఎనిమిది నెంబర్లను ఎంపిక చేసుకుని మానిటరింగ్ రిక్వెస్ట్ పెట్టాలి. ఇక మనం ప్రయాణిస్తున్న ప్రాంతం వివరాలు, వాహనం పేరు, నెంబరు నమోదు చేస్తే పూర్తి వివరాలు పోలీసుల నిఘా పరిధిలోకి వెళతాయి. ఈ యాప్‌ద్వారా బెసిక్ ఫోన్, స్మార్ట్, ఆండ్రాయిడ్ ఫోన్ ఏదైనాన్నికైనా ప్రతి 15నిమిషాలకు ఒకసారి ఆటోమెటిక్‌గా సేఫ్టీ మెసేజ్ వస్తుంది. వాటికి నాలుగు అంకెల రహస్య పాస్‌కోడ్ పంపించాలి. దాని ఆధారంగా మనం సురక్షితంగా ఉన్నామని పోలీసులు అప్రమత్తమవుతారు. తెలంగాణ సరిహద్దులను దాటినా ఎక్కువ సమయం ఎక్కడైనా ఆగినా, ప్రయాణ మార్గం మారినా టీ-సేఫ్ కంట్రోల్ రూం నుంచి నేరుగా 100 నెంబరుకు ఫోన్ వెళ్తుంది. దీంతో సంబంధించిన వారు వెంటనే స్పందించి సురక్షితమని చెపితే సరిపోతుంది. లేదంటే నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటారు.

యాప్‌ను వినియోగించుకోవాలి..: ఎస్సై సాగర్



మహిళలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే లక్ష్యంగా పోలీసు శాఖ టీ-సేఫ్‌యాప్‌ను రూపొందించింది. మహిళలు, యువతు లు, విద్యార్థి నులు ఈ యాప్‌ను వినియోగించుకోవాలి. ఆపదలో ఉన్న వారు ఈ యాప్ ద్వారా సురక్షితంగా బయటపడవచ్చు. ఈ యాప్‌పై విస్తృత ప్రచారం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఏసీబీ వలలో అవినీతి చేప

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మహిళా ఎస్సై
- కేసు నమోదు, ఏసీబీ కోర్టుకు తరలింపు



ఎస్సై రాజ్యలక్ష్మి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి



యాహియఖాన్

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 15: ఏసీబీ అధికారులకు అవినీతి చేప చిక్కింది. ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌లో మహిళాఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మి శనివారం రూ.25వేలు లంచం తీసుకుంటూ ఏసీబీఅధికారులకు పట్టుబడింది. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలంలోని బూర్గుడ జాతీయరహదారిపై గతనెల31న కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈకేసులో మంచిర్యాలజిల్లా నస్పూర్‌కు చెందిన యాహియఖాన్‌కు స్టేషన్‌బెయిల్ మంజూరు, వాహనం విడుదలకోసం ఎస్సై రాజ్యలక్ష్మి రూ.40 వేలు డిమాండ్ చేసింది. దీంతో సదరు వ్యక్తి ఆదివారం పోలీసుస్టేషన్‌కు వెళ్లి అంత మొత్తం చెల్లించలేనని రూ.25వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈమేరకు బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజ్యలక్ష్మికి రూ.25వేలు ఇవ్వగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి ఎస్సై రాజ్యలక్ష్మిని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరుచనున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఏసీబీసీఐలు తిరుపతి, కృష్ణకుమార్,హెడ్‌కానిస్టేబుల్‌వేణుగోపాల్ పాల్గొన్నారు.

రూ.40వేలు డిమాండ్ చేసింది.. యాహియఖాన్, బాధితుడు

స్టేషన్‌బెయిల్, వాహనం విడుదలకోసం కేసును లోక్‌అదాలత్‌ద్వారా పరిష్కరించే విధంగా చూస్తానని ఇందుకు తనకు రూ.40వేలు ఇవ్వాలని ఎస్సై రాజ్యలక్ష్మి డిమాండ్ చేసింది. దీంతో ఆదివారం పోలీసుస్టేషన్‌కు వచ్చి తాను మెకానిక్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని అంతమొత్తం ఇవ్వలేనని వేడుకున్నాను. చివరికి రూ.25వేలు ఇవ్వాలని పేర్కొంది. దీంతో తాను కరీంనగర్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదుచేశాను. ఈమేరకు సోమవారం ఎస్సై రాజ్యలక్ష్మికి రూ.25వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కౌటాల, ఏప్రిల్ 15: మండలంలోని వీర్దండి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఎస్ఈఆర్పీ పోచానీ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న సందర్భంగా ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత: ఎమ్మెల్యే



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 15: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. రెబ్బెన మండలం ఇంద్రానగర్‌లోని స్వయంభు కనకదుర్గ ఆలయంవద్ద ఈనెల 23,24,25తేదీల్లో జరుగనున్న జాతర ఆహ్వానపత్రికలను ఆలయ ప్రధానఅర్చకుడు దేవరవినోద్ ఎమ్మెల్యేకు అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంద్రనగర్ కనకదుర్గ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో భక్తులు తిరుపతి, సురేష్, సంతోష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో కూలీలకు పనులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15: ఉపాధిహామీ పథకంలో కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించాలని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచా యతీ అధికారి భిక్షపతి, కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్‌తో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల సంఖ్య పెంచి పూర్తిస్థాయిలో పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతికుటుంబానికి వందరోజుల పనికల్పించాలన్నారు. కూలి ధరలు పెరిగినందున ప్రతిజాబ్ కార్డుదారుడు ఉపాధిహామీపనికి వచ్చేలా కార్యదర్శులు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. వేసవి అయినందున పనిప్రదేశాల్లో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉదయమే పనికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాలల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

జైనూర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ అధ్వర్యంలో చేపటుడుతున్న అభివృద్ధి పనులను విద్యాసంవత్సరం ప్రారంభంలోపు పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం మండలంలోని జంగాం గ్రామపరిధిలో గల రాంజీగూడ, బూసీమెట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు తదితర సౌకర్యాం కల్పిస్తామన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 15: అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ప్రభుత్వ డిగ్రీకళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజు అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15: జిల్లాలోని ప్రతిఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విధంగా నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఈవో అశోక్‌తో కలిసి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. జిల్లాలో 90,828మంది 15సంవత్సరాలపైగా నిరక్షరాస్యులుగా ఉన్నారన్నారు. వీరందరినీ దశలవారీగా అయిదు సంవత్సరాల్లో అక్షరాస్యులుగా మార్చుతామన్నారు. మొదటి దశలో 14,979మందిని అక్షరాస్యులుగా మార్చుతామని తెలిపారు. ముందుగా చదవటం, రాయటం, చిన్నచిన్న లెక్కలు చేయటం నేర్పిస్తామన్నారు. అనంతరం క్రిటికల్ లైఫ్ స్కిల్స్‌లో ఫోన్ వినియోగం, డిజిటల్ లిటరసీని నేర్పిస్తామని తెలిపారు. ఒకేషనల్ స్కిల్స్ ద్వారా అక్షరాస్యత తోపాటు ఆర్థిక వనరులు పొందేమార్గాలను సూచించుట, ఫౌడేషన్ స్కిల్స్ నేర్చుకొన్న వారికి ప్రాథమికవిద్య, ఆపై వాటిని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ద్వారా నేర్పించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామన్నారు. నేర్చుకున్న విద్యను మర్చిపోకుండా ఉండేందుకు నిరంతర అభ్యసన వస్తువులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో భాగంగా గ్రామస్థులలో ప్రధానోపాధ్యాయులు సూపర్‌వైజర్‌గా ఒక ఉపాధ్యాయుడు టీచర్‌గా, మరో ఉపాధ్యాయుడు సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తారని అన్నారు. ఎప్పటికప్పుడు వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తామన్నారు. మొదటిదశలో జిల్లాలో 5,992 మంది పురుషులు, 8,987మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సి ఉంటుందన్నారు. ఇందుకు ఒక ప్రత్యేకమైన వాచకం, అక్షర వికాసం ముద్రిచామని తెలిపారు. ఇందులో16పాఠాలు, 124పేజీలు ఉంటాయన్నారు. దీనిని 200గంటల్లో బోధించాల్సి ఉంటుందన్నారు. వాచకం పూర్తి అయిన తదుపరి 150 మార్కుల ప్రశ్నపత్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 33 శాతం మార్కులు పొందితే ఉత్తీర్ణులైనట్లుగా భావిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలుచేసి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఈవో, డీపీవో, జిల్లా లైజనింగ్ అధికారి నాగరాజు, మధుకర్ పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి..

తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్‌టెన్త్, ఇంటర్‌పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఈనెల 25నుంచి మే2 వరకు కొనసాగే పరీక్షల నిర్వహణపై డీఈవో అశోక్, ఏఎస్పీ ప్రభాకర్, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావుతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ పరీక్షల్లో 368 మంది విద్యార్థులు ఓపెన్‌టెన్త్, 284మంది విద్యార్థులు ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు రెండు పరీక్షా కేంద్రాలు, ఇంటర్ విద్యార్థులకు రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలు చేస్తామన్నారు. విద్యార్థుల కోసం మౌలికవసతులు ఏర్పాటు, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. వేసవిదృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పరీక్ష సమయాన్ని ముందే విద్యార్థుల పరీక్షకేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో సురేందర్, డీఎం హెచ్‌వో తుకారాం, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ఈఈ వెంకటపతి, విద్యుత్‌శాఖాధికారులు, ఆర్టీసీఅధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులను ప్రారంభించాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పథకంలో భాగంగా బాలికలకోసం నిర్మించే టాయిలెట్ల పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేంచారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖాధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి సమావేశమాయ్యరు. అమ్మ ఆదర్శపాఠశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతులు, టాయిలెట్ల నిర్మాణపనులపై ఆరాతీశారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఉన్న 170 ప్రభుత్వ పాఠశాలలో బాలికల కోసం నిర్మించే ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించి మే 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేట్ ప్రతులను వెంటనే సమర్పించాలని కోరారు. టాయిలెట్ల నిర్మాణం, మరమ్మతుల పనుల్లో భాగంగా జిల్లాగ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో వ్యవహ రించి పనులను పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలో రోడ్లు భవనాలశాఖ ఈఈ పెద్దన్న, పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్లు, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు చర్యలు

జిల్లాలో బాల్యవివాహాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాసంక్షేమ శాఖాధికారి భాస్కర్‌తో కలిసి బాల్య వివాహాల నివారణ, బాలికల రక్షణ అంశాలపై బాలికా సంరక్షణ అధికారులు, సీడీపీవోలు, సఖీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. బాల్య వివాహాల కారణంగా జరిగే అనర్థాలు, భవిష్యత్‌లో వచ్చే ఆరోగ్య సమస్యలపై బాలికల తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. బాలికల సంరక్షణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు అవసరమైన మందులను ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సామ్ మామ్ నిర్వహించాలని తెలిపారు. భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు అందించాల్సిన పోషకాహారాన్ని సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వేసవి సెలవుల్లో జాగ్రత్తగా ఉండాలి

సిర్పూర్(టి), ఏప్రిల్ 15: విద్యార్థులు వేసవి సెలవుల్లో జాగ్రత్తగా ఉండాలని డాక్టర్లు నవత, సుజాత అన్నారు. సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో ఎండతీవ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఎండల వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకోవాలని, అధికంగా నీరు తీసుకోవాలన్నారు. 10గంటలు దాటిన తరువాత ఆటలు ఆడవద్దన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ నర్సయ్య, రాజలింగు, సూపర్‌వైజర్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలోపు వంతెన పూర్తి చేయాలి

సిర్పూర్(యు), ఏప్రిల్ 15: మండలంలోని రాఘాపూర్ సమీపంలో నిర్మిస్తున్న వంతెనను వర్షాకాలంలోపు పూర్తిచేయాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని లింగాపూర్ జడ్పీటీసీ రక్కాబాయి లాక్యనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ రాఘాపూర్ వంతెన పునర్ నిర్మాణంకోసం కాంట్రాక్టర్ పాతవంతెనను మూడు నెలల క్రింతం కూల్చివేశాడన్నారు. వాహనాల రాకపోకల కోసం తాత్కాలిక రోడ్డువేశాడని అన్నారు. అయితే వర్షాలు పడితే వేసిన తాత్కాలిక రోడ్డు కోట్టుకు పోయే అవకాశాలు ఉన్నాయన్నారు. దీంతో లింగాపూర్, సిర్పూర్(యు), తిర్యాణి మండలాల ప్రజలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయన్నారు. వెంటనే వంతెన నిర్మాణం ప్రారంభించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు.



ఆర్కే5గని పిట్ కమిటీ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 15: ఆర్కే5గని పిట్ కమిటీని సోమవారం శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. పిట్ కార్యదర్శిగా ఇప్ప నరేష్, సలహాదారుగా చిగురి లక్ష్మణ్, ఏ రిలే ఇన్‌చార్జిగా బట్టు సురేందర్, బీ రిలే ఇన్‌చార్జిగా దామెర తిరుపతి, సీ రిలే ఇన్‌చార్జిగా పోతు వెంకటేష్, డి రిలే ఇన్‌చార్జిగా చిలువటకారి తిరుపతిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పిట్ కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ, గనిలో కార్మికులు ఎదుర్కొనే సమస్యలపై యాజమాన్యాన్ని నిలదీసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గోలేటిలో ఫుట్‌బాల్ టోర్నమెంటు

రెబ్బెన, ఏప్రిల్ 15: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల18నుంచి 20వరకు గోలేటి భీమన్నస్టేడియంలో వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ టోర్నీకి హైదరాబాద్, కామారెడ్డి, ఆసిఫాబాద్, కరీంనగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, చంద్రాపూర్‌వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి 12జట్లు పాల్గొంటున్నట్లు వివరించారు. ఈటోర్నీలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయన్నారు. విన్నర్ జట్టుకు రూ.50వేలు, రన్నర్ జట్టుకు రూ.30వేలు నగదు బహుమతి, ట్రోఫీ అంజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

రెబ్బెన, ఏప్రిల్ 15: సింగరేణియాజమాన్యం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులుకు స్కిల్ డెవలప్‌మెంటు కోర్సులపై శిక్షణ ఇస్తున్నట్లు పర్సనల్ మేనేజర్‌రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. గతంలో ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈనెల 30వరకు పెంచినట్లు ఆయన వివరించారు. ఈ శిక్షణలో కాస్మటాలజీ టెక్నీషియన్, సెల్‌ఫోన్‌టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, కంప్యూటర్‌అండ్‌డీటీపీ, తదితరకోర్సులకు శిక్షణ ఉంటుందన్నారు. బెల్లంపల్లిఏరియా అభ్యర్థులు గోలేటి(ఎంవీటీసీ)వృత్తిశిక్షణకేంద్రంలో సంబంధిత అప్లికేషన్, సర్టిఫికేట్స్‌తో దరఖాస్తులు చేయాలని కోరారు.

కార్మికుల హక్కులే ధ్యేయంగా ముందుకు సాగాలి: ఐఎన్టీయూసీ

మందమర్రి టౌన్, ఏప్రిల్ 15: సింగరేణిలో కార్మికుల హక్కులే ధ్యేయంగా యూనియన్‌నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య, జిల్లాఅధ్యక్షుడు రాంశెట్టి నరేందర్ తెలిపారు. ఆదివారం రాత్రి స్థానికకార్యాలయంలో నిర్వహించిన మందమర్రి ఏరియా జనరల్‌బాడీ సమావేశంలో వారు మాట్లాడారు.

ఇటీవల జరిగిన సింగరేణి కార్మిక గుర్తింపుసంఘం ఎన్నికల్లో కొద్దితేడాతో ఓడిపోయి ప్రతిపక్ష యూనియన్‌గా ఎన్నికయ్యామని పేర్కొన్నారు. మెజా రిటీ కార్మికులు ఆరు ఏరియాల్లో ఐఎన్టీయూసీకి విజయం కట్టబెట్టారని పేర్కొన్నారు. నాలుగున్నర దశాబ్దాలకు పైగా సింగరేణి కార్మికుల గొంతుకగా జనక్‌ప్రసాద్ పని చేసి నందునే ఆయనకు ప్రభుత్వం కనీసవేతనాల బోర్డు చైర్మన్‌గా పదవి కట్టబెట్టిందని పేర్కొన్నారు.

పనిచేసే ప్రతిఒక్కరికి సరియైన గుర్తింపు ఉంటుందనడానికి జనక్‌ప్రసాద్ ఒక ఉదాహరణ అని వారు పేర్కొన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లోవిజయమే ఏకైకలక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కదం తొక్కాలన్నారు. సమావేశంలో నాయకులు బిక్షపతి, సూర్య నారాయణ, తిరుపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఘర్ వాపసీ కార్యక్రమం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్‌పార్టీ అనుబంధ టీబీజీకేఎస్ ఘర్‌వాపసీ నినాదం కార్యక్రమం చేపడుతోంది. ఇందులో భాగంగా మూడు రోజులుగా సింగరేణి వ్యాప్తంగా టీబీజీకేఎస్‌ను వీడి ఇతర యూనియన్‌లలో చేరిన వారిని మళ్లీ యూనియన్ అగ్రనాయకులు మిర్యాల రాజిరెడ్డి, రామ్మూర్తి సంప్రదిస్తున్నారు. దీంతో తిరిగి ఇతర యూనియన్‌లలో చేరిన వారు సొంత గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులతో చర్చించి నూతనకమిటీలను వేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా మొదట సంఘానికి కన్వీనర్‌లుగా రాజిరెడ్డి, రామ్మూర్తిని ఎన్నుకున్నారు. దీంతో వీరు సింగరేణివ్యాప్తంగా సంఘం బలోపేతమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటు న్నారు. ఇతర యూనియన్‌లలో చేరిన ముఖ్య నాయకులు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో టీబీజీకేఎస్‌లో చేరుతున్నట్లు తెలిసింది. ఘర్ వాపసీ కార్యక్రమం గోలేటి నుంచి కొత్తగూడెం వరకు చేపట్టనున్నట్లు అగ్రనాయకులు నిర్ణయం తీసుకున్నారు.

మోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయాలి



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గెడెం నగేష్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15: నరేంద్రమోదీని మూడోసారి ప్రధాన మంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడెం నగేష్ అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రేమలాగార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ, బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆదిలాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, పాల్వాయి హరీష్‌బాబుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భగా మాట్లాడుతూ పార్టీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని ఆదరించి గెల్పించాలి..

కాగజ్‌నగర్: బీజేపీని ఆదరించి తనను ఎంపీగా గెల్పించాలని ఆపార్టీ ఎంపీ అభ్యర్థి గెడెం నగేష్ అన్నారు. సోమవారం సిర్పూరు నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మచ్చలేని పాలన కేవలం పీఎం మోదీతోనే సాధ్యమైందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి లక్ష ఓట్లు బీజేపీకి వేయాలన్నారు. ఇందుకు బూత్‌స్థాయినుంచి మండల స్థాయి వరకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ దేశం పురోభివృద్ధి దిశగా వెళ్లాలంటే కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో గెడెం నగేష్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. సమావేశంలో జడ్పీ మాజీచైర్‌పర్సన్ చిట్యాల సుహాసిని, బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సక్కు గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి: ఎమ్మెల్సీ



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

చింతలమానేపల్లి, ఏప్రిల్ 15: ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. సోమవారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా బీఎస్పీ, ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో పలువురు చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ రాజన్న, నీలాగౌడ్, లాంచు, ఎంపీటీసీ సుశీల భర్త తిరుపతి పార్టీలో చేరారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు

కాసిపేట, ఏప్రిల్ 15: కాసిపేట మండలంలోని అక్రమ వడ్డీ, ఫైనాన్స్ చిట్టీల నిర్వాహకుల ఇళ్లపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ముత్యంపల్లికి చెందిన ఇంగు నారాయణ ఎలాంటి అనుమతులు లేకుండా చిట్టీలు నడుపుతున్నాడు. ఇతని వద్ద నుంచి సంతకాలతో కూడిన ప్రామిసరీ నోట్లు, బుక్కులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వేములవాడలో శ్రీరామభక్తోత్సవం ప్రారంభం

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీరామ భక్తోత్సవం సోమవారం ప్రారంభమైంది. శ్రీరామనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు మూడు రోజులపాటు నిర్వహించే శ్రీరామ భక్తోత్సవంలో తొలిరోజు ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో యాగశాల ప్రవేశం, మండపారాధన నిర్వహించారు. రాజరాజేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఉపనిషత్ ద్వారా అభిషేకం చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేకములు నిర్వహించారు. పార్వతీరాజరాజేశ్వరస్వామి, శ్రీలక్ష్మీఅనంత పద్మనాభస్వామి వారలను అశ్వ వాహనంపై ఊరేగించారు.

ముమ్మరంగా వరి కోతలు



దండేపల్లి,ఏప్రిల్ 15: పల్లెల్లో వరి కోతలు మొదలయ్యాయి. యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి కోత దశకు రావడంతో హార్వెస్టర్ యంత్రాలతో కోతలు ప్రారంభమయ్యాయి. వ్యవసాయబావులు, విద్యుత్ పంపుల ఉన్న చోట్ల రైతు లు సాగు చేయడంతో ఇప్పుడు కోత దశకు వచ్చాయి. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి పంటలకు సాగునీరు అందించడంతో వరి పంటను సాగు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి హార్వెస్టర్లు అద్దెకు తీసుకువచ్చి కోతలు చేపడుతున్నారు.

నష్టపరిహారం పెంచాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

జైపూర్, ఏప్రిల్ 15 : మండలంలోని నర్వ శివారు నుంచి గోపాల్‌పూర్ శివారు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం పెంచాలని సోమవారం మండల తహసీల్దార్ వనజారెడ్డికి రైతులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఈ భూములకు నష్టపరిహారం చాలా తక్కువగా ఇస్తూ నోటీసులు అందజేశారని , మా గ్రామాల్లో భూముల బహిరంగ మార్కెట్ విలువ సుమారు ఎకరానికి రూ. 40 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉందని, ప్రస్తుతం ఉన్న రేటు ప్రకారం నష్టపరిహారం పెంచాలని కోరుతున్నామన్నారు. లేకపోతే తమ భూములు ఇవ్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, రామ్‌రెడ్డి, కృష్ణమూర్తి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దండేపల్లి, ఏప్రిల్ 15 : వేసవిలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతో దోహదపడుతుందని అరుణ ఇండెన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ యజమాని బొయిడి వెంగల్‌రావు అన్నారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగల అరుణ ఇండెన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను సోమవారం ఆయన ప్రారంభించారు. మేనేజర్ ఎలిగేటి సుధాకర్, నాయకులు కట్కూరి రాజన్న, సిబ్బంది నాగరాజ్, భూమన్న, కిషన్, కరుణాకర్ పాల్గొన్నారు.

అక్రమ వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ

ఏసీసీ, ఏప్రిల్ 15 : మంచిర్యాల పట్టణంలో అక్రమ వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. సీసీసీ నస్పూర్‌కు చెందిన ఎస్‌కె ఇమ్రాన్ గతంలో నస్పూర్‌లో మనీ లెండర్ లైసెన్స్ తీసుకున్నాడన్నారు. లైసెన్స్ గడువు ముగిసినప్పటికీ మంచిర్యాల పట్టణంలోని జగదాంబ కాంప్లెక్స్ లోని ఓ షెట్టర్‌లో ఆఫీస్ ఓపెన్ చేశాడన్నారు. పది శాతం వడ్డీకి అప్పులు ఇస్తున్నాడన్నారు. ఆదివారం రాత్రి ఆఫీస్‌పైదాడి చేసి 68 ప్రామిసరీ నోట్లు, 16 ఖాళీ చెక్కులు, రూ. 7.64 లక్షల నగదు, రిజిష్టర్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వడ్డీ వ్యాపారుల ఇండ్లపై పోలీసుల దాడులు

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో అనుమతులు లేకుండా చిట్టీలు, వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న షాపులపై సోమవారం దాడులు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్న మామిడాల లక్ష్మీనారాయణ ఎలాంటి అనుమతులు లేకుండా చిట్టీ వ్యాపారం చేయడంతోపాటు బ్లాంక్ చెక్కులు పెట్టుకుని అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడని తెలిపారు. లక్ష్మీనారాయణ వద్ద నుంచి ఐదు బ్లాంక్ చెక్కులతోపాటు రిజిష్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాకా కుటుంబాన్ని విమర్శించే అర్హత బీజేపీకి లేదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 15: కాకా వెంకటస్వామి కుటుంబాన్ని విమర్శించే అర్హత బీజేపీ నాయకులకు, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌కు లేదని మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తెలిపారు. సోమవారం మందమర్రిలోని ఆయన నివాసం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల కోసం పాటుపడిన గొప్ప నాయకుడు కాకా వెంకటస్వామి అని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన తనయులు వివేక్, వినోద్‌లు ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో ప్రజల్లో ఆలోచన మొదలైందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదన్నారు. కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ 5 లక్షల మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. సీనియర్ నేత దుర్గం నరేష్ మాట్లాడుతూ మోదీ పాలనకు వ్యతిరేకంగా ర్యాలీలు, నిరసనలు జరుగుతున్నాయన్నారు. బెల్లంపల్లి, చెన్నూరులో గడ్డం సోదరులను గెలిపించడానికి కారణం ప్రజలకు సేవ చేస్తారనే నమ్మకంతోనే అన్నారు. ప్రజలకు విశాఖ ట్రస్టు ద్వారా బోర్ వెల్స్, పాఠశాలల్లో బెంచీలు, తదితర కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కాకా కుటుంబాన్ని విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ఓదెలు, గుడ్ల రమేష్, రాయబారపు కిరణ్, రవిందర్, పైడిమల్ల నర్సింగ్, మంద తిరుమల్, ఎండి ఇస్సాక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సన్మానం


విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 15: మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో గౌరవ పురస్కారాలు-2024కు రామకృష్ణాపూర్‌లోని తవక్కల్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఆశ్లేష, దీక్షిత, రచన, ఐశ్వర్య, శ్రీవైష్ణవిలు ఎంపికయ్యారని తవక్కల్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. వీరు జాతీయ స్థాయి పోటీలలో 3వ స్థానం సాధించారని, ఈనెల 8న హైదరాబాద్‌లో ప్రశంసాపత్రాలు అందుకున్నారన్నారు. సోమవారం తవక్కల్ పాఠశాలలో విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను చైర్మన్ అజీజ్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు సాంస్కృతిక రంగాలలో రాణిస్తున్న విద్యార్థుల కృషిని కొనియాడారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన సమీక్ష ఆర్ట్స్ అకాడమీని అభినందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంబలి పంపిణీ

కాసిపేట, ఏప్రిల్ 15 : కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమం దేవాపూర్‌లో నిరంతరంగా కొనసాగుతుంది. గ్రామాల నుంచి దేవాపూర్ వచ్చే ప్రజలు, కార్మికులు అంబలి తాగుతూ సేద తీరుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ తెలిపారు. ఎండలు తగ్గే వరకు అంబలి పంపిణీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జన్నారం, ఏప్రిల్ 15: సోనాపూర్ తండా, బంగారు తండాకు చెందిన 80 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో ఉట్నూరులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ముజఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

చెన్నూరు, ఏప్రిల్ 15: పట్టణానికి చెందిన కొండపాక చారి బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా సోమవారం నాయకులు సన్మానించారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా జనరల్ సెక్రెటరీ అశోక్, పట్టి వెంకటకృష్ణ, వెంకటన్న, రమేష్, మధు, లక్ష్మీనారాయణ, శివకృష్ణ పాల్గొన్నారు.

నేడు అన్నదానం

మందమర్రిరూరల్, ఏప్రిల్ 15: అందుగులపేట పంచాయతీలోని కోరెగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ దీక్ష చేపట్టిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కోరె గోపాల్, పూజారీ అశోక్ శర్మలు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



దండేపల్లి, ఏప్రిల్ 15: ద్వారకలో శీతల్‌దేవి పోచమ్మదేవి ఆలయంలో సోమవారం వైభవంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. రవి అయ్యాగారి ఆధ్వర్యంలో హోమం, పూర్ణహుతి, ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఆలయకమిటీ నిర్వాహకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాల శోభాయాత్ర


మందమర్రిలో సీతారాముల విగ్రహాల శోభాయాత్ర

మందమర్రిటౌన్, ఏప్రిల్ 15 : పట్టణంలో సోమవారం రాత్రి పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి కోల్‌బెల్ట్ రోడ్డు మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా హనుమాన్ మాలధారణ భక్తులు గీతాలు ఆలపించారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ శోభాయాత్ర నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

వ్యాపారి ఇంట్లో నగదు పట్టివేత

కోటపల్లి, ఏప్రిల్ 15: మండలంలోని పారుపెల్లి గ్రామంలో మంచాల సంతోష్ అనే వ్యాపారి ఇంట్లో సోమవారం రాత్రి దాడి చేసి నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా లక్షల రూపాయలు ఇంట్లో ఉన్నాయనే సమాచారం మేరకు సంతోష్ ఇంట్లో సోదా చేయగా రూ.12,21,200లు దొరికినట్లు తెలిపారు. ఈ నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో డబ్బును ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15: జిల్లాలో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టగా సోమవారం నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సోమవారం 41.4డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిర్యాణిలో41.4, రెబ్బెనలో40.7, కాగజ్‌నగర్‌లో40.3, చింతలమానేపల్లిలో 40.0, కౌటాలలో 39.9, కెరమెరిలో 39.8, బెజ్జూర్, దహెగాం, ఆసిఫాబాద్‌లలో39.7, సిర్పూర్(టి)లో39.6డిగ్రీలఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శ్మశాన స్థలం కబ్జాపై ఫిర్యాదు

బెజ్జూరు, ఏప్రిల్ 15: మండలంలోని ముంజంపల్లి గ్రామంలో శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేయడంపై సోమవారం గ్రామస్థులు తహసీల్దార్ భూమేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నోఏళ్లుగా గ్రామసమీపంలో ఉన్న స్థలాన్ని శ్మశానానికి వినియోగిస్తున్నామన్నారు. ఆ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేశారని, ఈ విషయమై అడిగితే ఈ భూమి తనదేనని అంటున్నాడని అన్నారు. వెంటనే కబ్జాకు గురైన స్థలాన్ని రక్షించి గ్రామస్థులకు ఉపయోగపడేలా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఇచ్చినవారిలో అశోక్, బానయ్య తదితరులు ఉన్నారు.

సర్‌సిల్క్ రాం మందిర్‌లో విగ్రహాల పునఃప్రతిష్ఠాపన


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్ బాబు


పూజల్లో పాల్గొన్న కోనేరు కోనప్ప


కౌటాలలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15:సర్‌సిల్క్ రాంమందిర్‌లో సోమవారం సీతారాముల విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. వేదపండితులు కమలాకరశర్మ, మహేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సిర్పూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

బెజ్జూరు: భాజాభజంత్రీలు, మేళా తాళాలు, వేదమంత్రోచ్చరణ మధ్య సోమవారం కొత్తగూడలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. గ్రామస్థులు చందాలు వేసుకుని ఆలయాన్ని నిర్మించగా సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. ఈసందర్భంగా ఆలయం ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటుచేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా అన్నదానంచేశారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కౌటాల: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని తుమ్మిడిహెట్టి ప్రాణహితనదివద్ద గల కార్తీక్‌మహారాజ్, సీతారాముల ఉత్సవవిగ్రహాల ఊరేగింపును సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమికి వారంరోజుల ముందు కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు, సిర్పూర్(టి) మండలాల్లో ఉత్సవవిగ్రహాలను ఊరేగించడం అనవాయితీ. ఇందులో భాగంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీరామనవమి నాటికి ఆలయంలో సీతారాముల కల్యాణానికి ఉత్సవ విగ్రహాలు చేరుకుంటాయి. ఇందులో భాగంగా గ్రామస్థులు మంగళహారతులతో స్వాగతం పలికారు.

కిరాణ దుకాణాలపై దాడి


జరిమానా విధిస్తున్న అధికారి

సిర్పూర్(టి), ఏప్రిల్ 15: మండలంలోని కిరాణ దుకాణాల్లో తూనికలు కొలతల అధికారి జలీల్ సోమవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఒకకిరాణ దుకాణంలో బియ్యంసంచిపై 26కిలోలు రాసి ఉండగా ఆ బియ్యంను తూకం నిర్వహించగా ఆ ఒకకిలో బియ్యం తక్కువ వచ్చింది. దీంతో కిరాణ దుకాణం యజమానికి రూ.20 వేల జరిమానా విధించారు. ఇదిలా ఉండగా కిరాణ దుకాణం యజమాని తాము రైస్ మిల్లు నుంచి బియ్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నామని తాముఎలాంటి అవకతవకలకు పాల్పడలేదన్నారు. తనకు అన్యాయంగా అధికారులు జరిమానా విధించారని పేర్కొన్నాడు.

ఎర్రబండలో ఇల్లు దగ్ధం


రోదిస్తున్న బాధితుడు

తిర్యాణి, ఏప్రిల్ 15: మండలంలోని ఎర్ర బండ గ్రామంలోని గొడెం నాగుబాయికి చెందిన ఇల్లు సోమవారం దగ్ధమైంది. ప్రమాదవశాత్తు ఇంటికి మంటలు అంటుకోవడంతో ఇల్లుతో పాటు ధాన్యం, ఎడ్లబండి మంటలకు ఆహుతిఅయ్యాయి. బాధిత కుటుంబం సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. సుమారు మూడులక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు లబోదిబోమంటున్నారు.

సీఎంను కలిసిన టీఎమ్మార్పీఎస్ నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డితో టీఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15: సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో జిల్లా టీఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్సీకార్పొరేషన్ ద్వారా రుణాలను మంజూరు చేయాలని, ఎస్సీ సబ్‌ప్లాన్‌లో మాదిగలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ నాయకులు పాపన్న, ధర్మయ్య తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెంచికలపేట, ఏప్రిల్ 15: పెంచికలపేట మండలం నుంచి రేషన్‌బియ్యం అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఎల్లూరు గ్రామానికి చెందిన ఎండీ ముబాషీర్ ఇంట్లో దాడులు నిర్వహించగా అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 15క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలపారు. దాడుల్లో సిబ్బంది పీసీమధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

పాఠశాలకు తాళం వేసిన కాంట్రాక్టర్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15: కాగజ్‌నగర్ పెట్రోల్ పంపులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం కాంట్రాక్టర్ హబీబ్ తాళం వేశాడు. తాను మన ఊరి మన బడి పథకం ఈ పాఠశాలలో అదనపుగదులు నిర్మించినట్టు తెలిపారు. వీటి తాలుకూ రూ.97లక్షలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే బిల్లులు విడుదల చేయాలని, లేని పక్షంలో తాళం తెరవనని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు ముకుందం వెంటనే డీఈవో అశోక్‌కు సమాచారం అందించారు. డీఈవో సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్‌చేసి బిల్లుల జాప్యం గురించి వివరించారు. అనంతరం తాళం తెరవటంతో విద్యార్థులు బడిలోనికి వెళ్లారు.

ఉపాధి పనుల్లో పాల్గొనాలి: ఎంపీడీవో

కెరమెరి, ఏప్రిల్ 5: ఉపాధి హామీపనుల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎంపీడీవో కృష్ణమూర్తి అన్నారు. సోమవారం ఆయన సుల్తాన్‌గూడలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రభుత్వం గ్రామీణప్రాంతాల్లో వలసల నివారణకు ఉపాధిహామీ పథకం ఏర్పాటు చేసిందన్నారు. కూలీలు సైతం పారితోషికం ఇటీవలే రూ.300లకు పెంచిందన్నారు. పనిప్రదేశంలో చలవ పందిర్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. ఆయనవెంట ఏపీవో మల్లయ్య, కార్యదర్శి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

సిర్పూర్(యు), ఏప్రిల్ 15: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన అందించాల్సిన అవసరం ఉందని మహగాం స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అనిత అన్నారు. సోమవారం మండలంలోని దేవుగూడ, ఖాతీగూడ, ప్రెసిడెంట్‌గూడ తదితర గ్రామాల్లో పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలకు సంబంధించిన రికార్డులను, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను సకాలం పూర్తి చేయాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా బడికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు

లింగాపూర్ ఏప్రిల్ 15: పోలింగ్ బూత్‌లో సకలసౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలో 17పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని గ్రామాల్లోగల పోలింగ్‌బూత్‌లను ఆయన పరిశీలించారు. పోలింగ్‌కేంద్రాలను బీఎల్ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలకు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయనవెంట మండల పంచాయతీ అధికారి ఉమర్‌షరీఫ్, మండల సెక్టోరల్ అధికారి పవన్‌కుమార్, ఆర్ఐలు ప్రకాష్, ప్రదీప్, సాగర్ పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల

జిల్లా వార్తలు

5

మంగళవారం 16 ఏప్రిల్ 2024



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 15 :శ్రీరాంపూర్‌లోని ఆర్కె 6 సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్ ఫార్మర్ బిగిస్తున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని నస్పూర్ ఏఈ రామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాంపూర్, ఆర్కె 6 గుడిసెలు, శ్యాంనగర్, సంఘమల్లయ్యపల్లె, ఓల్డ్ ఆంధ్రాబ్యాంక్ ఏరియా, లక్ష్మీనగర్, గాంధీనగర్, సుభాష్‌నగర్, చర్చి ఏరియా, ప్రశాంత్‌నగర్, క్రిష్ణకాలనీ, పిట్టల కాలనీ ఏరియాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వడదెబ్బకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

వేమనపల్లి, ఏప్రిల్ 15 : ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు సూచించారు. సోమవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి గ్రామీణులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయటకు వెళ్లాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే రక్షణ చర్యలు పాటించాలని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలు ప్రజలందరికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యాధికారి రాజేష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 15: పట్టణంలోని మహ్మద్‌ఖాసీంబస్తీలోని కమ్యూనిటీ హాలు సమీపంలో ఉన్న గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రంథాలయంలో ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యంతోపాటు దినపత్రికలు, పుస్తకాలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కౌన్సిలర్ గెల్లి రాజలింగు, శంకర్‌సింగ్, ఖలీల్, అయాజ్, ప్రవీణ్‌కుమార్, శ్రావణ్,కళ్యాణ్, సాయినాథ్ పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం



పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయాధికారులు

హాజీపూర్, ఏప్రిల్ 15: మండలంలోని పెద్దంపేటలో రైతు బెంబడి గురువయ్య సాగు చేసిన వరి పంటను సోమవారం అర్థ గణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి సత్యం, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఉప గణాంక అధికారి శ్రీకాంత్‌లు సందర్శించారు. పంట దిగుబడిని అంచనా వేశారు. పంట పొలంలో ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం చేయగా 19.855 కిలో గ్రాముల దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాల న్నారు. మండల వ్యవసాయాధికారి రజిత, రమేష్ కనకరాజు , రైతులు పాల్గొన్నారు.

నీటిని సక్రమంగా సరఫరా చేయాలి

జన్నారం, ఏప్రిల్ 15: మండల ప్రజలకు ఎండాకాలం తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని ఎంపీడీవో శశికళ పేర్కొన్నారు. సోమవారం చింతగూడలో పర్యటించారు. చెడిపోయిన చేతి పంపులను మరమ్మతు చేయించారు. అలాగే గ్రామంలోని బావులు, వాటార్ ట్యాంకులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఎంపీవో, ఏపీవో ,పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత



నస్పూర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత

నస్పూర్, ఏప్రిల్ 15: నస్పూర్ శివారులోని సర్వే నంబరు 64లో అక్రమంగా వెలిసిన షెడ్‌ను, మరో చోట వెంచర్‌ను సోమవారం టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేశారు. అనుమతి లేకుండా వెలిసిన వెంచర్‌లోని హద్దురాళ్లను తొలగించి వేశారు. ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా అక్రమించి కట్టడాలు కడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ భూమి అక్రమ నిర్మాణం చేస్తే మున్సిపల్ చట్టం-2019 ద్వారా చర్యలు తీసుకొంటామన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ చిట్యాల సతీష్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మాంతయ్య, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జీవోను ఉపసంహరించుకోవాలి



సీడీపీవోకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

చెన్నూరు, ఏప్రిల్ 15: అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సోమవారం అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీడీపీవోకు వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు లక్షల రూపాయలు, 60 సంవత్సరాలు దాటిన వారికి వీడిఎస్ కల్పించిందని, దీని ప్రకారం కొత్త జీవో జారీ చేయాలన్నారు. సీఐటీయూ నాయకుడు నగేష్, అంగన్‌వాడీ టీచర్‌లు ప్రవీణ, పద్మావతి, శారద, మణిమాల, విజయలక్ష్మీ, భారతి, లలిత, సురేఖ, సావిత్రి, రాజుబాయ్, హేమలత, సుగుణ పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపిక

జన్నారం, ఏప్రిల్ 15: జన్నారంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కాలేజీలో సోమవారం హైద్రాబాద్‌కు చెందిన ఏఎన్ఎన్ నెట్‌వర్క్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 200 మంది హాజరు కాగా, 11 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ముత్యం సతీష్, మేనేజింగ్ డైరెక్టర్ మహేష్, రఘులు తెలిపారు.

జాతరకు ఆర్థిక సహాయం

ఏసీసీ, ఏప్రిల్ 15 : మంచిర్యాల పట్టణంలోని 9 వార్డు రంగంపేటలో లక్ష్మీదేవర జాతర నిర్వహణకు కౌన్సిలర్ బొలిశెట్టి సునీతకిషన్ రూ. 5 వేలు విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయంలో పట్నాలు, బోనాల కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. జాతరలో ప్రజలు పాల్గొనాలన్నారు. భీమన్న తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో అన్నదాతల దగా



రైతు కష్టం దళారుల పాలవుతోంది. దిగుబడులకు మద్దతు ధర పొందడంలో రైతన్నలు దగా పడుతున్నారు. మామిడి, కంది, పత్తి, వరి, మిర్చి, కూరగాయలు ఇలా ఏ పంట పండించినా నిలువునా మోసపోతున్నారు. రైతుల అమాయకత్వాన్ని దళారులు, వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రింబవళ్లు కష్టపడి పంట సాగు చేసిన రైతుల కంటే... దళారులకు కాలు కదపకుండా ఉన్నచోటే కాసుల పంట పండుతోంది. నేల తల్లిని నమ్ముకున్న రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతుండగా... దళారులు, వ్యాపారులు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు.

- రైతన్న పొట్టగొట్టి కోట్లు గడిస్తున్న వ్యాపారులు
- అందుబాటులోకి రాని ఆన్‌లైన్ మార్కెటింగ్
- నాగ్‌పూర్‌లో మోసపోతున్న మామిడి రైతులు
- మద్దతు ధరలు లభించక నష్టపోతున్న ధాన్యం, పత్తి రైతులు

నెన్నెల, ఏప్రిల్ 15: అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్నారు. దళారులు, కొనుగోలుదారులు కుమ్మక్కై మద్దతు ధరను తగ్గిం చేస్తున్నారు. తీసుకెళ్లిన సరుకులు వెనక్కి తీసుకరాలేక, వచ్చిన ధరకు అమ్మడం తప్ప గత్యంతరం లేని దుస్థితి ఉంది. ఇదే బలహీనతను ఆసరాగా చేసుకుని రైతులను నిండా ముంచుతున్నారు. ఇప్పటికైన దళారులు, వ్యాపారుల బెడద నుంచి రైతులను కాపాడాల్సిన అవసరం ఉంది.

మామిడి రైతుకు 'మహా' మోసం

జిల్లాలో సాగువుతున్న మామిడి కాయల్లో 80 శాతం మహారాష్ట్రలోని నాగపూర్ తరలిస్తారు. అక్కడ మార్కెట్లో రైతులకు కమీషన్ ఏజెంట్ల బెడద వెంటాడుతోంది. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే సరుకును ఇతర రాష్ట్రాలకు అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రెతులు దోపిడీకి గురవుతుండగా వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కోట్లు గడిస్తున్నారు. నాగ్‌పూర్ మార్కెట్లో రోజు వేలం పాట నిర్వహించి ఏ రోజుకారోజు ధర నిర్ణయిస్తారు. 15 శాతం కమీషన్ తీసుకుంటారు. తక్‌పట్టి (రసీదు) చేతికి వచ్చే సరికి ఏ రకానికి ఎంత ధర వేశారో తెలియదు. ధరల మాయాజాలంలో మామిడి రైతులు యేటా నష్టపోతూనే ఉన్నారు.

మామిడి తోటలకు కమీషన్ ఏజెంట్లు

నాగపూర్ చెందిన బడా వ్యాపారుల మనుషులు తోటలకు వచ్చి రైతులను మభ్యపెడుతున్నారు. మంచిర్యాలలోని లాడ్జీల్లో అడ్డా పెట్టుకుని గ్రామాల్లో తిరిగి రైతులకు గాలం వేస్తున్నారు. తమ అడ్తీ దుకాణానికి సరుకు తీసుకెళితే మంచి ధరకు అమ్మిపెడతామని నమ్మబలుకుతూ అడ్వాన్సులు అంటగడుతున్నారు. అడ్వాన్సు తీసుకుని ఉన్నందున మరో దుకాణానికి వెళ్ళే ఛాన్సే ఉండదు. దీంతో అక్కడి వ్యాపారి చెప్పిందే వేదం. పట్టీపై రాసిచ్చిందే ధర. ముందు చెప్పిన ధరకు మార్కెట్‌లో చెల్లించే ధరకు చాలా తేడా ఉంటుందని రైతులు వాపోతున్నారు.

వ్యాపారులకే తెల్ల బంగారం...

పత్తి పండించిన రైతులు యేటా నష్టాలనే మూటగట్టుకుంటున్నారు. కొనుగోలు చేసే వ్యాపారులు, దళారులు మాత్రం కోట్లు సం పాదిస్తున్నారు. వ్యాపారులు గ్రామాల్లో పెచ్చు, తరుగు, పేరిట ఒక కిలో అదనంగా తీసుకుంటున్నారు. నగదు డబ్బులు కావాలంటే 15 శాతం కటింగ్‌తో చెల్లిస్తున్నారు. నెల రోజుల ఉద్దెరతో బేరం సాగిస్తున్నారు. ధరలు పెరుగుతాయని ముందుగానే పసిగట్టే దళారులు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసి మిల్లుల్లో నిల్వ చేసి ధరలు పెరిగిన తరువాత విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సీజన్ ప్రారంభంలో ప్రైవేటులో పత్తి క్విం టాలుకు రూ.6500లు ఉంది. సీసీఐ కేంద్రాల్లో క్వింటాలుకు రూ.6900ల నుంచి రూ.7020 వరకు అమ్ముకున్నారు. రైతులు తమ వద్ద ఉన్న పత్తి మొత్తం అమ్ముకున్నాక ధర పెరిగింది. ప్రస్తుతం ప్రైవేటులో పత్తి ధర క్వింటాలుకు రూ. 7800 పలుకుతోంది. దీంతో మొదట్లో పత్తి విక్రయించిన రైతులు నష్టపోయారు. జిన్నింగ్ వ్యాపారులకు కాసుల వర్షం కురిసింది.

ధాన్యం.. దళారులకు భోజ్యం

ధాన్యంతో యేటా మిల్లర్ల పంట పండుతోంది. దిగుబడులు చేతి కొచ్చిన సమయంలో ఉన్న ధర పెరగడం ఆనవాయితీగా మారింది. ఖరీఫ్‌లో పండించిన సన్నాలకు రైతు చేయి దాటినాక క్వింటాలుకు రూ.వెయ్యి పెరిగింది. యాసంగి దిగుబడులు చేతికి వస్తున్న వేల ధరలు మళ్లీ నేల చూపులు చూస్తున్నాయి. పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులు వచ్చిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని పెరిగిన ధరలతో వ్యాపారులు లాభపడుతున్నారు. ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేసినప్పటికీ బియ్యం ధరలను మాత్రం వ్యాపారులు తగ్గించడం లేదు.



మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌లో మామిడి కాయల వేలం పాటలో దళారుల సందడి

కూరగాయల మార్కెట్లో బ్రోకర్లదే రాజ్యం...

కూరగాయల పంట చేతికొస్తుందనగానే దళారులు గ్రామాల్లో వాలిపోతున్నారు. గతంలో ఒక్కో ఏరియాలో ఒక్కో దళారిది రాజ్యంగా ఉండేది. ఇప్పుడు సీన్ మారింది. దళారులంతా సిండికేట్‌గా మారారు. దీంతో రైతులు ఎక్కడికెళ్లినా దళారులంతా ఒకే రేటు చెబుతున్నారు. ఆ ధరకే కొంటామంటున్నారు. ఇలాంటి దళారీ వ్యవస్థ కూరగాయల రైతులను భారీ నష్టాల్లో ముంచేస్తోంది. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, మందమర్రి లాంటి పట్టణాల్లో కూరగాయల మార్కెట్లలో దళారుల హవా నడుస్తోంది. కూరగాయల మార్కెటింగ్‌లో రైతులే వినియోగ దారుడికి నేరుగా అమ్ముకునే వ్యవస్థ రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నామ్‌కే వాస్తేగా.. ఈ నామ్

మార్కెట్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చి దళారులు, వ్యాపారుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ (ఈ-నామ్) జిల్లాలో అందుబాటులోకి రాలేదు. కొనుగోళ్లలో పారదర్శకత, రైతులకు ప్రయోజనమే లక్ష్యంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఏటీఏఆర్ఐ) అభివృద్ధి చేసిన ఈ కామర్స్ పోర్టల్ (కిసాన్ కార్ట్.ఆన్‌లైన్) సైతం జిల్లా రైతుల దరికి చేరడం లేదు. మూడేళ్ల కిందట పలు చోట్ల ఈ-మార్కెట్ విధానం అమల్లోకి తీసుకువచ్చారు. ఈ పథకంపై రైతాంగం ఎన్నో ఆశలు పెట్టుకు న్నారు. గిట్టుబాటు ధర వస్తుందని ఆశించిన రైతన్నలకు నిరాశే ఎదురవుతోంది. సరకులు మార్కెట్‌కు తెచ్చాక రైతు పేరు, గ్రామం, పంట ఉత్పత్తి, తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పంట ఉత్పత్తులను జాతీయ స్థాయిలో కొనుగోలుదారులు పరిశీలించి ధరను కోడ్ చేస్తారు. ఎక్కువ రేట్ కోడ్ చేసిన వ్యాపారి వివరాలను అధికారులు రైతు మొబైల్‌కు ఎస్ఎంఎస్ చేస్తారు. వ్యాపారులు సిండికేట్ కావడం, మోసం చేయడం ఉండదు.

దళారీ వ్యవస్థను రూపుమాపాలి : రత్నం తిరుపతి అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు



దిగుబడులను అమ్ముకోవడంలో రైతులు అడుగడుగునా మోసపోతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కడం కీలకం. ఇందుకోసం ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవాలి. ఆన్‌లైన్ మార్కెటింగ్ అందుబాటులోకి తేవాలి. అన్నదాతలు నేరుగా ఆన్‌లైన్ ద్వారా దిగుబడులను విక్రయించే ఏర్పాట్లు చేయాలి. ఇందుకోసం రైతాంగానికి ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించాలి. దళారీ వ్యవస్థ రూపుమాపితేనే రైతుల ఆదాయం పెరుగుతుంది.

పాఠశాలల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 15: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అభివృద్ధి పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో కిషన్, డీఈవో యాదయ్యతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్య కమిటీలకు రూపాంతరంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేశామని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడమే లక్ష్యంగా నిర్ధేశించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల బలోపేతం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి, మరమ్మతు, తరగతి గదుల విద్యుద్దీకరణ, ఏకరూప దుస్తుల తయారీ సౌకర్యాల కల్పన లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనిచేస్తోందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల పేరిట బ్యాంకు ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని, ఇందుకు ఒక ఉమ్మడి స్టాంప్‌ను తయారు చేయించుకోవాలని తెలిపారు. పనుల పురోగతిపై ఫొటోలు తీసి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పనులకు సంబంధించిన బిల్లులను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. బడి బయట పిల్లలను గుర్తించి వారు పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకొంటామన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

రైతుల సంక్షేమానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, రైతులు దళారులను నమ్మిమోసపోవద్దని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి రైసుమిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీఎంఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని,మరపట్టించిన ధాన్యాన్ని సీఎంఆర్ డెలివరీస్ కింద ఎఫ్‌సీఐకి అందించాలన్నారు. జిల్లా రోజు వారీ మిల్లింగ్ సామర్థ్యం 1,864 మెట్రిక్ టన్నులు కలిగి ఉందని, ఈ ప్రకారంగా 2023-24 సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్‌ను రోజు వారీగా నిర్ధేశించిన ప్రకారం డెలివరీ చేయాలని తెలిపారు. రైసుమిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

జిల్లాలో సహకార వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సహకార సంఘాల కంప్యూటరీకరణ, మోడల్ బైలాల ఆమోదం, గిడ్డంగుల నిర్మాణం, సీఎస్‌సీల ఏర్పాటు తదితర ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా సహకార అధికారి నర్సయ్య, జిల్లా పశు సంవర్థక శాఖ సంచాలకులు రమేష్, మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ, సహకార బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీధర్‌రెడ్డి, డీడీఎం రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

హాజీపూర్, ఏప్రిల్ 15: హాజీపూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో మధుసూధన్, ఎంపీపీ స్వర్ణలతలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

దండేపల్లి, ఏప్రిల్ 15 : రాజుగూడ గిరిజన గ్రామానికి చెందిన పుర్కా శ్రీకాంత్ అనే యువకుడికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అందజేశారు. శ్రీకాంత్ అనారోగ్యానికి గురికావడంతో ప్రథమ చికిత్స కోసం ఆసుపత్రిలో చేరాడు. మెరుగైన వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. సీఎంఆర్ఎఫ్ రిలీఫ్‌ఫండ్ ద్వారా రూ.60వేలు మంజూరు కాగా చెక్కును సోమవారం ఎమ్మెల్యే నివాస గృహంలో యువకుడి తండ్రి జైతుకు అందజేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్, మాజీ సర్పంచు ఆడాయి కాంతరావు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు

చెన్నూరు, ఏప్రిల్ 15: సుద్దాల గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. గ్రామానికి వచ్చిన ఒక ముని వాగు ఒడ్డున చింతచెట్టు కింద సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామి విగ్రహాలను బయటకు తీసినట్లు చెబుతారు. అక్కడే వాగు ఒడ్డునే పందిరి వేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. చెన్నూరు పట్టణానికి చెందిన రామడుగు కిష్టయ్య అనే వ్యక్తి కలలో శ్రీరాముడు కనిపించి తనకు ఆలయాన్ని నిర్మించాలని చెప్పగా అతను గ్రామస్థుల సహాయంతో డంగు సున్నంతో 1910లో ఆలయాన్ని నిర్మించారు. అలాగే ఆలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి పంచలోహవిగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు.

బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో సీతారాముల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు మరింత అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

బీజేపీ ప్రచారం

చెన్నూరు, ఏప్రిల్ 15: కన్నెపల్లి గ్రామంలో సోమవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. రాపర్తివెంకటేశ్వర్లు, మోర్ల శంకర్, బాపు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీషర్ట్‌లు అందజేత

భీమారం, ఏప్రిల్ 15: ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సింగాపూర్‌లోని యువతకు క్రికెట్ టోర్నమెంట్ కోసం సోమవారం ఫౌండేషన్ చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్యరాజ్‌కుమార్ నాయక్ టీషర్ట్‌లను అందజేశారు. యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులు,యువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, మాట్లాడుతున్న బండి ప్రభాకర్

జైపూర్, ఏప్రిల్ 15: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. టేకుమట్ల, ముదిగుంట, బెజ్జాల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు యువకులు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి నివాసంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులు అవుతూ ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు.

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని టీపీసీ కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి బండి ప్రభాకర్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొన్ని పార్టీల కాకా కుటుం బంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అనంతరం బండి ప్రభాకర్‌యాదవ్‌ను నాయకులు సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కంకకటి శ్రీనివాస్, మల్లేష్, రాజన్న, రాము నాయక్, గౌస్, కృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అణచివేతకు గురవుతున్న బీసీలు



మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 15: జనాభా నిష్పత్తి ప్రకారం 60 శాతం ఉన్న బీసీలను అన్ని రంగాల్లో పాలకవర్గాలు అణగదొక్కుతున్నాయని బీసీ ఐక్యవేదిక నాయకులు రంగు రాజేశం, పోలు శ్రీనివాస్, వడ్డెపల్లి మనోహర్, పార్వతి రాజిరెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం బీసీ చైతన్య యాత్ర మందమర్రికి చేరుకుంది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పాలకులు బీసీలకు ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం బీసీ జనాభా లెక్కలను చేపట్టాలని, దేశ వ్యాప్త జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ పెంచాలన్నారు. బీసీ మేలుకో రాజ్యమేలుకో నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎదగకుండ పార్టీలు అడ్డుకుంటున్నాయని పేర్కొన్నారు. పది శాతం లేని రెడ్డి, రావులు రాజ్యమేలుతున్నార ని, ఇప్పటికైనా బీసీలు చైతన్యంతో ముందుకు సాగాలన్నారు. నాయకులు ఎండి ఇబ్రహీం, జావేద్‌ఖాన్, ఇసాక్, గాండ్ల సంజీవ్, రాంవెంకటే శ్వర్లు, వాసాల శంకర్, శంకర్‌తో పాటు మల్లయ్య, పాల్గొన్నారు.